క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రంలో వెంచేసియున్న శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణం శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ క్రతువు వేదమంత్రాల నడుమ వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థానం మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నివాళి..



నివాళులర్పిస్తున్న మువ్వా, ఎమ్మెల్యే జారె

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి గ్రామానికి చెందిన తుమ్మల చెన్నారావు, ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన చిత్రపటానికి రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయబాబు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యులతో సేవలు అభినందనీయం

మణుగూరు టౌన్: అత్యవసరమైన గైనిక్, పిడియాట్రిక్ కేసులను స్థానిక ప్రైవేట్ వైద్యులతో సేవలు అందించేందుకు స్థానిక యాజమాన్యం అంగీకారం కుదుర్చుకోవడం అభినందనీయమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో గైనిక్, పిడియాట్రిక్ వంటి సేవలు అందుబాటులో లేక కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోని గైనకాలజిస్ట్ సంఘమిత్ర, పిడియాట్రిక్‌లు బుడగం రామకృష్ణ, బాలకృష్ణలతో సేవలు అందించేందుకు యాజమాన్యం కల్పించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు, డీవైసీఎంఓ జ్యోతిర్మయికి ఏరియా టీబీజీకేఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న పిచ్చేశ్వరరావు

అశ్వాపురం: దోసపాటి కళ్యాణ్ కల్కిల వివాహాన్ని పురస్కరించుకుని అశ్వాపురం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రముఖ వ్యాపారవేత్త శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు శనివారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

ఐదేళ్ల అభివృద్ధిపై పుస్తకావిష్కరణ



ఆవిష్కరిస్తున్న నాయకులు

గుండాల: అటు ప్రజాపోరాటాలతో, ఇటు ప్రజాప్రతినిధులతో మండలాభివృద్ధికి న్యూడెమోక్రసి కృషి చేస్తూనే ఉందని, ప్రజలకు అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఐదేళ్ల కాలంలో న్యూడెమోక్రసీ నుంచి గెలుపొందిన జెడ్పీటీసీ రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిపై పాకెట్ పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలకు నిస్వార్థంతో పనిచేశారని, మండలంలో చెరువులు, కుంటలు, అంతర్గత రోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఓ పక్క అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూనే ప్రభుత్వం రావాల్సిన నిధులపై, పోడు భూముల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, వాగబోయిన రామక్క, యాసారపు వెంకన్న, అరెం నరేష్, సారంగపాణి, కోరం సీతారాములు, లాలు, ఉపేందర్, లాలయ్య, మంగయ్య పాల్గొన్నారు.

దోమలు, ఈగలకు అడ్డుగా..

ఆకట్టుకుంటున్న మెష్‌డోర్లు..

- అందమైన డిజైన్లు.. అందుబాటులో ధరలు
- ఏజెన్సీ ప్రాంతంలో పెరుగుతున్న వినియోగం

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: వర్షాకాలం, చలికాలం దోమలు, ఈగల బెడద తీవ్రంగా ఉంటోంది. సాయంత్రమైతే చాలు ప్రతీ ఇంట్లో దోమలు, ఈగలతో వాటిని అంతం చేయడానికి బ్యాట్‌తో యుద్ధం చేస్తుంటారు. వీటితో ఇళ్లు, కార్యాలయాలు, వ్యాపారసంస్థలు అన్నిచోట్ల ఇబ్బందులు పడుతూనే ఉంటారు. ఈ క్రమంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లోకి కొత్తగా వచ్చిన మెష్‌డోర్లు దోమలు, ఈగల బెడదకు చెక్‌పెడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో దోమల నివారణకు మెష్‌డోర్ల వినియోగం బాగా పెరిగింది. ప్రతీ ఒక్కరు అందమైన ఇంటిని నిర్మించుకోవడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో.. అలాగే ఇంట్లోకి దోమలు రాకుండా చేసేందుకు అంతే శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రూ.లక్షలు వెచ్చించి టేకుకర్రతో అందమైన డిజైన్లతో చేసిన ఇంటి ప్రధాన ద్వారాలను సైతం దోమల నివారణకు బిగించిన మెష్‌డోర్లు కనిపించకుండా చేస్తున్నాయి.

దర్వాజలు, కిటికీలకు అమరుస్తూ..

ఇంటి ప్రధానద్వారంతోపాటు, నలువైపులా అన్ని దర్వాజలకు, కిటికీలకు మెష్‌డోర్లు బిగిస్తున్నారు. సింగిల్, డబుల్, రెండు రకాలుగా మెష్‌డోర్లు చేస్తున్నారు. అచ్చూ రెండు తలుపుల మాదిరిగా డబుల్ డోర్ ఏర్పాటుచేస్తున్నారు. కిటికీలకు సైతం సింగిల్, డబుల్ రెక్కలు ఉంటాయి. వీటిని తీసి పెట్టొచ్చు. ప్రధాన ద్వారానికి డ్రిల్లింగ్ చేసి మెష్‌డోర్లు అమర్చుతారు. డోర్ తీసి వేస్తే అతుక్కునేందుకు డోర్‌కు సన్నటి అయస్కాంతం అమరుస్తారు. అలాగే స్లైడింగ్ డోర్లలో టూ ట్రాక్, త్రీ ట్రాక్ అనే రెండు రకాల డోర్స్ లభిస్తున్నాయి. ఈ డోర్ల తయారీకి అల్యూమినియం వాడతారు. దర్వాజ ఫ్రేం, కిటికీల ఫ్రేం ముందు అతికినట్టుగా మెష్‌డోర్లు అమర్చడం వారి ప్రత్యేకత. ఇలా దర్వాజలు, రేట్ల బట్టి ఆకర్షించే డిజైన్లలో డోర్లు తయారుచేస్తున్నారు. మెష్‌డోర్ల వాడకం పెరగడంతో తయారీదారులు ప్రతీచోట అందుబాటులో ఉంటున్నారు. భద్రాచలం, సారపాక వంటి పట్టణాలతో పాటు, చర్ల, దుమ్ముగూడెంలో కూడా మెష్‌డోర్లు తయారు చేసే వారున్నారు.



దర్వాజకు ఏర్పాటుచేసిన మెష్‌డోర్..



కిటికీలకు..



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మెష్‌డోర్లు

దోమల బెడద తగ్గింది..



గతంలో దోమలతో చాలా ఇబ్బందిపడుతుండే వాళ్లం. వర్షాలు కురిసిన తర్వాత ఈగలు, రకరకాల పురుగులు సైతం వస్తుండేవి. ఇటీవల ఇంట్లో ముందు, వెనుక మెష్ డోర్లు ఏర్పాటు చేయించాం. దీంతో దోమలు, పురుగుల బెడద తగ్గింది. – శ్రీధిరాల రాజేశ్వరమ్మ, భద్రాచలం

వినియోగం పెరిగింది



భద్రాచలం పరిసర ప్రాంతాల్లో నూతనంగా నిర్మించే ఇళ్లకు మెష్‌డోర్లు తప్పనిసరిగా చేయిస్తున్నారు. అల్యూమినియం డోర్లు అందంగా ఉండడంతో పాటు, దోమలు, పురుగుల నుంచి రక్షణగా ఉంటుంది. ఏళ్లు గడిచినా చిలుము, పుచ్చురాకపోవడంతో మన్నికగా ఉంటుంది. మెష్ డోర్స్ తయారీకి ఇక్కడ మంచి ఆదరణ ఉంది.
– అనుగోజు కార్తీక్, మెష్ డోర్స్ షాపు, యజమాని, భద్రాచలం

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



అశ్వారావుపేటరూరల్: మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు



దుమ్ముగూడెంలో..

అశ్వారావుపేటరూరల్: ఆశ్రమ, హాస్టళ్లలో పనిచేసే దినసరి కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు మురహరి రఘు డిమాండ్ చేశారు. శనివారం అశ్వారావుపేట రింగ్ రోడ్డులో కార్మికులు చేపట్టిన సమ్మె 30వ రోజుకు చేరగా, ఆయన కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీను, అరుణ, కరుణాకర్, వెంకటేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : డైలీవేజ్ వర్కర్లకు వ్యతిరేకంగా ఉన్న జీఓ 64ను వెంటనే రద్దు చేయాలని వారికి టైం స్కేల్ ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీనగరం ఆశ్రమ పాఠశాల ఎదుట డైలీవేజ్ వర్కర్ల రాష్ట్రవ్యాప్త సమ్మె 31వ రోజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సమ్మెకు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి సరియం కోటేశ్వరావు, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు కాక కృష్ణ, డైలీ వేజ్ వర్కర్ల జిల్లా కార్యదర్శి హీరాలాల్, సమ్మక్క, బాపనమ్మ, సత్యనారాయణ, లక్ష్మి, భద్రమ్మ, తాటి పాపారావు, లక్ష్మయ్య, రాజు, రామక్క తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ఫీజుల భారాన్ని తగ్గించాలి

భద్రాచలంటౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సులకు భారీగా పెంచిన పలు రకాల ఫీజులను తక్షణమే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిగ్రీ 2025–26 ప్రవేశాలు పొందిన ఫస్ట్ ఇయర్ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచి పేద విద్యార్థులపై ఫీజుల భారాన్ని మోపిందన్నారు. ఒక్కో విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో రూ.80 ఉండగా ప్రస్తుతం రూ.1,200 రూపాయలకు పెంచారని, రికగ్నిషన్ ఫీజు గతంలో రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.800, ఐయుడీఎఫ్ ఫీజు గతంలో రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.300కు ఎస్‌డబ్ల్యూఎఫ్ ఫీజు గతంలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.200కు పెంచి విద్యార్థులపై తీవ్ర ఫీజు భారాన్ని మోపారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాము, కృష్ణ, కుమార్, సాయి, మధు పాల్గొన్నారు.

దాడి సమంజసం కాదు



మాట్లాడుతున్న గోపి

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని కమలాపురం ఇసుక క్వారీ నిర్వహించే కాంట్రాక్టర్ గంటా రమేశ్ అదే గ్రామానికి చెందిన మునిగెల నాగేశ్వరరావుపై పోలీసుల సమక్షంలో దాడికి పాల్పడటం సమంజసం కాదని కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... క్వారీ నడుపుకుంటూ గ్రామస్తులకు కనీసం నడిచేందుకు దారిని ఇవ్వకుండా పెత్తనం చెలాయిస్తూ పైగా గ్రామస్తులపై దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని, వెంటనే క్వారీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో షరీఫ్, పింగళి మాధవ రెడ్డి, చారి, రేణుక అక్షర మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ, షబానా, కోరి శ్యామల, రెడ్డి బోయిన రేణుక, దేరంగుల సుజాత, కన్నాపురం వసంత, డాకూరి సౌజన్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

పినపాక: ఈనెల 8, 9 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా పోటీల్లో ఈ బయ్యారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో మూడోస్థానం, బాలురు అండర్ 14 కోకో విభాగంలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం తిరుపతిరెడ్డి శనివారం అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వీరన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చంద్రుగొండ: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 30 ఏళ్ల అనంతరం ఈ సందర్భంగా కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు.


వాసవీక్లబ్ అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న శివకుమార్

బూర్గంపాడు: సారపాక వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్, జోన్– 3 పరిధిలో జోన్ చైర్‌పర్సన్ రేపాక రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా జోన్‌సోషల్ కార్యక్రమం శనివారం సారపాకలో శ్రీకరి బొటిక్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ పాలిశెట్టి శివకుమార్ హాజరై క్లబ్ సేవలను కొనియాడారు. జోన్ పరిధిలోని సారపాక గ్రేటర్, వనిత సారపాక, భద్రాచలం, కొత్తగూడెం సేవలను గుర్తిస్తూ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్స్ ప్రతినిధులు పచ్చిపులుసు వెంకట సుబ్బారావు, గుంటుపల్లి జగదీష్, చారుగుండ్ల రామకృష్ణ, శీమకుర్తి రాజమనోహర్, రేపాక ధనుంజయ, రాజమనోహర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



ట్రోఫీతో విజేతలు

పినపాక: మండల పరిధిలోని తోగూడెం పంచాయతీ గోపాలరావుపేట గ్రామంలో దసరా, దీపావళి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. శనివారం జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో రంగాపూర్, కాటాపూర్ జట్లు తలపడగా రంగాపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతకు మొదటి బహుమతి రూ.30 వేలు, షీల్డ్ లూబి మోటార్స్ సంస్థ నుంచి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జట్టుకు డీజే సతీష్ జ్ఞాపకార్థం అతని స్నేహితులు రూ.20,000 అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుసి శ్రీను, సత్యనారాయణ, సాంబశివరావు, నరసింహారావు, రామచంద్రు, నిర్వాహకులు బిల్లా నాగేందర్, సంతోష్, అశోక్, కోటి, దిలీప్, బృహస్పతి, నాగ మల్లేష్, సుధాకర్ రెడ్డి, శ్రీరామ్, నివేదన్ పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరు రూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో శ్రీ విద్యాభ్యాస పాఠశాలకు, ఉడతానేని గుంపులోని అమ్మనాన్న వృద్ధాలయానికి ఏపీలోని ఏలూరు జిల్లా చీకటివారి కొత్తగూడెంకు చెందిన చీకటి బ్రహ్మానందం–సూర్యవర్ధనమ్మ కుటుంబ సభ్యులు సాకారంతో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో క్వింటన్నర బియ్యాన్ని వితరణగా అందజేశారు. ఈ బియ్యాన్ని ఏరియా ఎస్‌ఓటు జీఎం బి శ్రీనివాసచారి చేతుల మీదుగా అందించారు. పాఠశాల, వృద్ధాలయ నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, ప్రసాద్, సమితి సభ్యులు నాసర్ పాషా, ఏ మంగీలాల్, కిరణ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

ములకలపల్లి: పత్తి సాగు చేసే మండలాల్లో విధిగా ప్రభుత్వ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలంగాణా రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. గోపగాని లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన మండలకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సంఘం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీసీఐ నిర్ణయించిన ధర ప్రకారమే కొనుగోళ్లు జరపాలన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టాలని, అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, బైరు ప్రసాద్, కుంజా రామ్మూర్తి, గద్దం వెంకటేశ్వర్లు, శ్రీదేవి, హేమాని, శ్రీరాములు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం పట్టణంలో 141 సీఆర్పీఎఫ్ బెటాలియన్ పోలీసులతో సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ మదన్ మోహన్‌రావు మాట్లాడుతూ... మానసిక సమస్యలను చిన్నచూపు చూడకుండా సరైన చికిత్స పొంది, ఒత్తిళ్లు, ఆందోళన, నిరాశలను జయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సెకండ్ కమాండ్ రాజేష్‌యాదవ్, డాక్టర్ రాజశేఖర్, క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షురాలు కమల రాజశేఖర్, వైద్యులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన

మణుగూరు రూరల్ : లయన్స్ ఇంటర్నేషనల్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్‌లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు ఒత్తిడిని జయించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రైవేట్ వైద్యులు, క్లబ్‌సభ్యులు డాక్టర్ శశిధర్ కార్మికుల మానసిక, శారీరక ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. క్లబ్ అధ్యక్షుడు షేక్ మీరాహుస్సేన్, జోన్ చైర్ పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు గాజుల పూర్ణచందర్‌రావు, చింతపల్లి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషకాహార మాసోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈనెల 16 వరకు పోషణమాసోత్సవాలు జరుగుతాయని భద్రాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్థానికంగా లభించే కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయన్నారు. ముఖ్యంగా మహిళలలో రక్తహీనత రాకుండా బలమైన పోషకాహారాన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు పోషకాహారంపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ ఎస్‌జీఓవో స్వాతి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, రాజేశ్వరి, వరలక్ష్మి, సావిత్రి, కిశోర బాలికలు, గర్భిణులు, తల్లులు, తదితరులు, పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి లేదు

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, 42 శాతం రిజర్వేషన్ పేరుతో స్థానిక ఎన్నికల్లో బీసీ ప్రజలను మరోసారి మోసం చేసి గెలవాలని చూసిందని తప్ప బీసీ రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి లేదని బీసీ సెల్ మండల కన్వీనర్ తంతరపల్లి వెంకటేశ్వరరావు విమర్శించారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన బీసీ విభాగం అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ జానీ పాషా, నాయకులు బొల్లి వెంకటరావు, లంక శివ, కుమ్మరికుంట సూర్య, భూసా రమేష్, భూక్యా చందు, గోసంగి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

దుమ్ముగూడెం: సమాజంలో జరుగుతున్న వరకట్న, గృహహింస, లైంగిక వేధింపులపై విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పారా లీగల్ వలంటర్ పిలక వెంకటరమణారెడ్డి సూచించారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండలంలోని దుమ్ముగూడెం కస్తూర్బా బాలికల పాఠశాల, మంగవాయి బాడువా బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ జి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు రూరల్: ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఏటీసీల్లో వాకిన్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గానూ ఆయా కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐదో విడత వాకిన్ ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ముందుగా it.telangana.govt.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న వారి ఈ నెల 13 నుండి 17వరకు మధ్యాహ్నం 1 గంటకు కళాశాలలో సంప్రదించి ప్రవేశం పొందవచ్చని తెలిపారు.

బీసీలకు అన్యాయం

అశ్వాపురం: బీఆర్ఎస్, బీజేపీల కుట్రల వల్లనే బీసీలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఉద్దేశంతో శాస్త్రీయంగా కులగణన సర్వే చేయడంతో పాటు బీసీ బిల్లును అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదింపజేశారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లుకు అడ్డుచెప్పడంతోనే రాష్ట్ర గవర్నర్ ఆరునెలలుగా బీసీ బిల్లుకు ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టారన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

పినపాక: బయ్యారం క్రాస్ రోడ్డు నుండి వెళ్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్సై సురేష్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు శనివారం బయ్యారం క్రాస్ రోడ్డులోని చెక్‌పోస్ట్ వద్ద లారీ, ఆటోడ్రైవర్లతో మాట్లాడారు. డ్రైవర్లు వాహనాల ధ్రువపత్రాలు ఉండాలని, ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు మహిళలపై జాగ్రత్త వహించాలని, అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయాలి

అశ్వాపురం: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. అశ్వాపురంలో బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనను రద్దు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశానన్నారు.

ఆర్థికసాయం

దుమ్ముగూడెం : మండలంలోని పైడాకులమడుగు గ్రామానికి చెందిన కుంజా లక్ష్మి కొంతకాలంగా కాలేయానికి సంబంధించిన కాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా శనివారం బాధితురాలికి బ్యూటిఫుల్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. లక్ష్మీ మెరుగైన వైద్యానికి దాతలు సహకరించాలని, 6302920445 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. బీఎల్ఎఫ్ ఉపాధ్యక్షుడు కణితి రాజు, సభ్యులు తుర్రం రాజారావు, గొంది శ్రీరాములు, కుంజా నాగార్జున, ఇర్ప శ్రీను, శ్యామల వీరాస్వామి, శీలం బాలకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ పక్షపాతి



సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

భద్రాచలంటౌన్: కాంగ్రెస్ పార్టీ బీసీ పక్షపాతి అని, బీసీలకు గుర్తింపు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్సే అని కాంగ్రెస్ బీసీ సంఘం నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని, కోర్టులో సైతం బీసీలకు అనుకూలంగా వాదనలు వినిపించిందన్నారు. ఆ రెండు పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే గవర్నర్ మీద ఒత్తిడి తీసుకొచ్చి బిల్లును ఆమోదించడానికి కృషి చేయాలని, లేదంటే బీసీ వ్యతిరేకులుగా పరిగణించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రత్నం రమాకాంత్, బుడగం శ్రీనివాస్, కొండిశెట్టి కృష్ణమూర్తి, రాజీవ్, హనుమంతరావు, చిట్టిబాబు, పుల్లారావు, కోటేష్, రామకృష్ణ, విజయ్, బండారు కృష్ణ, రాజేష్, రాము తదితరులు పాల్గొన్నారు.